ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి

● బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కోఆర్డినేటర్ గోలేం వెంకటేశం

కాగజ్‌నగర్, జూలై 13: ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కోఆర్డినేటర్ గోలేం వెంకటేశం డిమాండు చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల బాగోగులపై లేదన్నారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్, ఇతరత్రా వాటిని తుంగలోకి తొక్కిందన్నారు. కార్మికశాఖ కమిషనర్ స్పందించి వెంటనే ఎస్పీఎంలో ట్రేడ్‌యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మిల్లులోని కార్మికులు పాల్గొన్నారు.

ఎస్పీఎంలో కార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న ఆనంద్ శ్రీవాత్సవ్

కాగజ్‌నగర్, జూలై 13: ఎస్పీఎంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు ఆనంద్ శ్రీవాత్సవ్‌కు గాయాలయ్యాయి. శనివారం విధి నిర్వహణలో పనులు చేస్తుండగా ప్రమాదవశాతు చేతికి గాయాలయ్యాయి. వెంటనే తోటి కార్మికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఆనంద్ శ్రీవాత్సవ్ ఉత్తరప్రదేశ్‌కు చెందినవాడు. ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు పేర్కొన్నారు.

ప్రజా కృతజ్ఞత సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రెబ్బెన, జూలై 13: రెబ్బెన మండలంలో ఈ నెల 14న గోలేటి బస్టాండు ఆవరణలో సాయంత్రం నాలుగు గంటలకు ప్రజాకృతజ్ఞతసభను నిర్వహిస్తున్నట్టు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి తెలిపారు. శనివారం స్థానికంగా వారు మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను గెల్పించిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమనికి బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో మండల ప్రధానకార్యదర్శి జగన్నాథ్, ఓదెలు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, జూలై 13: జిల్లాలో శనివారం అయా మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆసిఫాబాద్, చింతలమానేపల్లి, సిర్పూర్(టి) మండలాల్లో మోస్తారు వర్షం కురియగా జిల్లాలో గడిచిన 24గంటల్లో జిల్లా వ్యాప్తంగా 5.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. లింగాపూర్‌లో 1.0మిల్లీమీటర్లు, వాంకిడిలో 2.2, కాగజ్‌నగర్‌లో 3.2, సిర్పూర్(టి)లో 6.2, కౌటాలలో 24.2, చింతలమానేపల్లిలో 13.2, బెజ్జూరులో 33.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

పడకేసిన పల్లె పాలన..

● వీధి దీపాలు లేక చీకట్లో గ్రామాలు
● గ్రామపంచాయతీల్లో పుట్టెడు సమస్యలు
● నిధులు రాక సొంత డబ్బులు వెచ్చిస్తున్న వైనం
● దీనికి తోడు సర్వేలతో అదనపు పనిభారం
● ఏడు నెలలుగా సపాయిలకు అందని వేతనాలు
● పాలకవర్గాలు లేవు.. ప్రత్యేకాధికారులు పట్టించుకోరు



బెజ్జూరు మండలం ఎల్కపల్లి గ్రామంలో రోడ్డుపై మురుగు నీరు

తాను విధులు నిర్వహించే గ్రామ పంచాయతీలో నిధులు లేక ఒక కార్యదర్శి 4నెలలలుగా ట్రాక్టర్ డీజిల్, వీధి దీపాల కొనుగోలు ఇతర మరమ్మతుల కోసం సొంతంగా డబ్బులు ఖర్చు చేశాడు. ఈ ఆర్థిక భారంతోపాటు అధికారులు అప్పగిస్తున్న సర్వేలతో అదనపుభారం మోస్తున్నాడు. ఏడు నెలలలుగా సపాయి కార్మికులకు జీతాలు రాకపోవడంతో వారిని బతిమిలాడి పని చేయించుకుంటున్న దుస్థితి. ఈ దుస్థితి జిల్లాలోని దాదాపు గ్రామపంచాయతీ కార్యదర్శులంతా అనుభవిస్తున్నట్లుగా తెలుస్తున్నది. పంచాయతీ పాలకవర్గాలు లేక ఇప్పటికే ఆరు నెలలు కావస్తున్నది. ప్రత్యేకాధి కారులు ఉన్నారంటే ఉన్నారన్నట్టుగానే ఉంది. గ్రామ సర్వతో ముఖాభివృద్ధికి కథానాయకుడై నడిపించాల్సిన కార్యదర్శే ప్రస్తుతం కష్టాల్లో ఉండటం గమనార్హం. - బెజ్జూరు

జిల్లాలో 335 గ్రామపంచాతీలు ఉన్నాయి. దాదాపు అన్ని గ్రామపంచాతీల్లోనూ కార్యదర్శులు విధులు నిర్వహి స్తున్నారు. గతంలో గ్రామాల అభివృద్ధి పనులు, మరమ్మతులు, నిధుల వ్యవహారమంతా సర్పంచ్‌లు, పాలకవర్గాలు చూసుకునేది. కానీ గడిచిన జనవరి నెలాఖరుతో పాలకవర్గాల గడువు పూర్తయింది. ఆ వెంటనే ప్రతీ గ్రామానికి ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించింది. ఇతర శాఖల్లో కీలకంగా ఉన్నవారికే ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు అప్పగించడంతో వారు గ్రామాలపై సరైన దృష్టి పెట్టడం లేదు. తమ మాతృశాఖలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎప్పుడో ఒకసారి గ్రామాలకు వస్తున్నప్పటికీ సలహాలు, సూచనలకే పరిమితమవుతున్నారు. దీంతో భారమంతా స్థానికంగా ఉండే పంచాయతీ కార్యదర్శిపై పడుతోంది.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు మరమ్మతులు, గ్రామ నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు, పన్నుల వసూళ్లు, ఆదాయ వ్యయాల లావాదేవీలు, నెలవారి చెల్లింపులు తదితర విషయాలన్ని వీరే పర్యవేక్షించాల్సి వస్తోంది. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. గ్రామపంచాయతీలకు రావాల్సిన కేంద్ర, రాష్ట్రాల నిధులు ఆగిపోయాయి. దీంతో చాలా పంచాయతీ ఖాతాల్లో నిధుల కొరత ఏర్పడింది. గ్రామపంచాయతీల్లో సపాయి కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. ట్రాక్టర్ల కిస్తీలకు నిధులు చాలడం లేదు. వీధి దీపాలు లేక గ్రామాల్లో చీకట్లో అలుముకుంటున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో వీధులన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. మురికి కాలువలు పూర్తిగా పూడిక తో నిండి దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. వీటి పనులను పంచాయతీ కార్యదర్శులే దగ్గరుండి చూసుకోవాల్సి వస్తోంది. కార్యదర్శులే సొంతంగా డబ్బులు పెట్టి చేయిస్తున్నారు. ఇటు పాలకవర్గాలు లేక అటు గ్రాంట్లు, నిధులు రాక మరో వైపు ప్రత్యేకాధికారులు పట్టించుకోక నలిగిపోతున్నారు.

కిస్తీలకు సరిపోక..

చిన్న పంచాయతీల్లో వసూలయ్యే ఏడాది ఇంటిపన్ను రెండు, మూడు నెలల ట్రాక్టర్ కిస్తీలకు కూడా సరిపోవడం లేదని ఆయా పంచాయతీల కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటికి మిషన్ భగీరథ రావడంతో నీటి పన్నులు పూర్తిగా రద్దు చేశారు. ప్రభుత్వం ఇచ్చే పల్లెప్రగతి నిధులే దిక్కుగా మారుతున్నాయి. పంచాయతీలకు గరిష్ఠంగా వచ్చే నిధులు ఏడాదికి రూ.10లక్షల నుంచి రూ.15లక్షలు ఉంటుంది. వాటిలో ట్రాక్టరు కిస్తీలు, మరమ్మతులు, డీజిల్ కోసం ఏటా రూ.6.50లక్షల వరకు ఖర్చవుతోంది. వచ్చే నిధుల్లో సగం వీటికే పోతే అభివృద్ధి పనులు ఎలా చేయాలని కార్యదర్శులు వాపోతున్నారు.

గ్రామపంచాయతీలకు వచ్చే నిధుల్లో ట్రాక్టర్ కిస్తీకి రూ.26,000, పారిశుధ్య కార్మికుడి వేతనం రూ.9,500, ట్రాక్టర్ మరమ్మతుకు రూ.2,500, డీజిల్ ఖర్చు రూ.4,000, విద్యుత్ బిల్లు రూ.10,000 మొత్తం ఖర్చు రూ.52వేలు వరకు అవుతోంది. ప్రస్తుతం పాలకవర్గాల పదవీకాలం పూర్తి కావడంతో ఆ నిధులు కూడా రాకపోవడంతో పంచాయతీల భారమంతా కార్యదర్శులే మోయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక చిన్న పంచాయతీలకు వచ్చే నిధులకు, ఖర్చులకు పొంతన ఉండటం లేదు. వచ్చే నిధులు ఏ మూలకు సరిపోవడం లేదు. వీటితోపాటు పంచాయతీల్లో చిన్నపాటి సమస్యల పరిష్కారానికి సైతం డబ్బులు వెచ్చించాల్సి ఉంటుందని వాపోతున్నారు. ఈ పరిస్థితి జిల్లాలో అన్ని చిన్న పంచాయతీల్లో ఉంది.

విధి నిర్వహణలో ఏఆర్ పోలీసుల కృషి భేష్

● ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



పాల్గొన్న ఏఆర్ పోలీసులు, మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జూలై 13: విధి నిర్వహణలో ఏఆర్ పోలీసుల కృషి భేష్ అని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆర్మ్‌డ్ రిజర్వు ఫోర్స్‌తో దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగావాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పెండింగ్ బిల్లుల సమస్య కూడా వీలైనంత త్వరగా తీరుస్తామన్నారు. జిల్లా పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో సివిల్, ట్రాఫిక్, క్రైం వంటి ప్రధాన విభాగాలతోపాటు ఏఆర్ విభాగం కూడా ఎంతో సమర్థవతంగా పని చేస్తోందని పేర్కొన్నారు. ప్రమోషన్లు, బదిలీల్లో సిబ్బంది పనితీరుతోపాటు ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని కూడా దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకుంటామన్నారు. పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందని అదే విదంగా పనికి తగిన ఫలితం కూడా అందేలా చూస్తామని తెలిపారు. జిల్లాలో స్పెషల్ పార్టీ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినం దించారు. జిల్లాలో మావోయిస్టుల కదిలి కలను నియంత్రించడంలో స్పెషల్‌పార్టీ పోలీసుల కృషి మరువలే నిదని అన్నారు. పదిమందికి చెప్పే బాధ్యతాయుత స్థానంలో మనం ఉన్నాం కాబట్టి మనం ఎలాంటి అవాంచనీయ కార్యక్రమాలకు పాల్పడకుండా బాధ్యతగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ రాణాప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆర్ఐ ఎంటీవో అంజన్న, ఆర్ఐ హోంగార్డు ఇన్‌చార్జి భరత్‌భూషన్, ఆర్ఎస్సైలు, జిల్లా పోలీసుసంఘం అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన మొహర్రం



వాంకిడిలో ప్రతిష్ఠించిన పీరీలు

వాంకిడి/సిర్పూర్(టి), జూలై 13: కులమతాలకు అతీతంగా జరుపుకునే మొహర్రం పండగ ప్రారంభమయింది. వాంకిడి మండల కేంద్రం తోపాటు ఖమాన గ్రామంలో, సిర్పూర్(టి)లో పీరీల బంగ్లాలు ఏర్పాటు చేశారు. బంగ్లాల ముందు అలైగుంతలను తవ్వి పీరీలను ప్రతిష్ఠించారు. పీరీల బంగ్లాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పీరీల బంగ్లాల వద్ద ప్రజలు ప్రత్యేకపూజలు చేస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు. ప్రతిరోజు పీరీల బంగ్లాల ముందు తవ్విన అలైగుంతలవద్ద పిల్లలు, యువకులు భాజాభజంత్రీలతో ఆడుతున్నారు. ఈనెల 17వరకు మొహర్రంను ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సిర్పూర్(యు), జూలై 13: మండలంలోని పుల్లార‌గ్రామానికి చెందిన ఆత్రం రాజు(59) శనివారంఅనారోగ్యంతో మృతిచెందగా కాంగ్రెస్‌నాయకురాలు ఆత్రం సుగణ బాధిత కుటుంసభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెవెంట మాజీఎంపీటీసీ కుడ్మేత యశ్వంత్‌రావు, మార్లవాయిమాజీసర్పంచ్ కనకప్రతిభ, గ్రామస్థులున్నారు.

అరకొర వర్షాలు.. అన్నదాత దిగాలు

సిర్పూర్(టి)/కెరమెరి, జూన్ 13: మండలంలో 16 గ్రామపంచాయతీల పరిధిలోని 27గ్రామాల్లో ఈసారి వానాకాలంలో 13,020ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు. కెరమెరి మండలంలో అన్నిగ్రామాల్లో 8176మంది రైతులు 22వేలఎకరాల్లో పత్తిపంట సాగుచేస్తున్నారు. కానీ అరకొర వర్షాలతో రైతులు దిగాలు చెందుతున్నారు. మొలకెత్తిన పత్తి మొక్కలు వడలిపో తున్నాయని రైతులు లబోదిబో మంటున్నారు. కాగా కొందరు రైతులు ఆరుతడి పంటలు వేశారు. అధి కారులు, శాస్త్రవేత్తలు వర్షం వస్తేనే పత్తిగింజలు వేయాలని పదేపదే చెప్పినప్పటికీ అధికారుల మాటలు వినకుండా వేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని తెలుస్తోంది.



అడ ప్రాజెక్టు కాల్వను పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

అడ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, జూలై 13: జిల్లాలో ఉన్న అడ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ క్యాంపులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ ప్రాజెక్టు కాల్వల నిర్మాణం పూర్తైనా ఇంతవరకు పంట భూములకు నీరు అందటం లేదన్నారు. సీఎం వెంటనే స్పందించి రూ.20 కోట్లు విడుదల చేయాలన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నీరందిస్తే బెంగాళీ క్యాంపులో మూడువేల ఎకరాలకు నీరందించే అవకాశాలున్నాయన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పలు చెరువులకు మరమ్మతులు కూడా చేపట్టాలన్నారు. ఆయన వెంట నాయకులు లెండుగురేశ్యాంరావు, ఆవుల రాజ్‌కుమార్, కొండ రాంప్రసాద్, మిథున్ బిశ్వాస్, నిత్యానంద మహంతు, కాశిపాక రాజు, రాంటెంకి నవీన్ తదితరులు ఉన్నారు.



కాంట్రాక్టు కార్మికుల్లో గందరగోళం



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

శ్రీరాంపూర్, జూలై 13: వైద్యపరీక్షల పేరుతో కాంట్రాక్టు కార్మికుల్లో సింగరేణి యాజమాన్యం గందరగోళం సృష్టిస్తోందని సింగరేణికాలరీస్ కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం అన్నారు. నస్పూర్ సివిల్‌కార్యాలయంలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైమాట్లాడారు. సింగరేణికాంట్రాక్టు కార్మికులకు ఉచితవైద్యం కల్పించలేని యాజమాన్యం టెస్టులపేరుతో కార్మికుల్లో ఆందోళన కలిగించడం తగదన్నారు. నిత్యం దుమ్ము,ధూళిలో పనిచేసే కార్మికులకు అనారోగ్యం కలుగడం సహజమేనన్నారు. ఆయా సందర్భాల్లో వారికి ఉచితవైద్యం అందించడం లేదన్నారు. బీపీ, షుగర్, ఈసీజీలో తేడాలు వచ్చినా డ్యూటీకి అర్హులు కారంటూ పేర్కొనడం సరికాదన్నారు. వైద్య పరీక్షలు పూర్తయ్యేవరకు, మందులు వాడి నయం అయ్యేవరకు మస్టర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేందర్, శంకర్, తిరుపతి, గోపాల్, నర సమ్మ, కమలమ్మ,పుష్ప,శారద,నాగమణి, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిని కొనసాగించండి: జీఎం

శ్రీరాంపూర్, జూలై 13: వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తిని కొనసాగించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. శనివారం ఆయన శ్రీరాంపూర్ ఉపరితలగనిని సందర్శించారు. ఓబీ వెలికితీత, బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగవద్దన్నారు. నిర్దేశిత ఉత్పత్తి కోసం తగిన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం సీఆర్ఆర్ కంపెనీ కాంట్రాక్టు ఉద్యోగులకు నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీవో టిశ్రీనివాస్, ఇన్‌చార్జి మేనేజర్ ఐ శ్రీనివాస్, డిప్యూటీసీఎంవో డాక్టర్ రమేష్‌బాబు, సర్వేఅధికారి సంపత్, సంక్షేమాధికారి బిశంకర్,వైద్యసిబ్బంది,కాంట్రాక్టుకార్మికులు పాల్గొన్నారు.

నామినేషన్ పద్ధతిలో గనులు కేటాయించాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న సీతారామయ్య

శ్రీరాంపూర్, జూలై 13: సింగరేణి బొగ్గు బ్లాకులను నామినేషన్ పద్ధతిలో సింగరేణికే కేటాయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య కోరారు. ఈ మేరకు ఆయన ఏరియా జీఎం బి సంజీవరెడ్డికి వినతిపత్రం అందించారు. వారం రోజులుగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే దీక్షలు శనివారం ముగియడంతో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గుజరాత్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, తదితర రాష్ట్రాల్లో నామినేషన్ పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం గనులు కేటాయించిందని, తెలంగాణలోని సింగరేణికి సైతం వేలం వేయకుండా నామినేషన్ విధానంలో గనులు కేటాయించాలన్నారు. దీక్షలకు పెద్దఎత్తున కార్మికులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉప ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకలదాసు, సీపీఐ మండల కార్యదర్శి జోగులమల్లయ్య, యూనియన్ నాయకులు, మైనింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి: హెచ్ఎంఎస్

శ్రీరాంపూర్, జూలై 13: కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 15న శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి కోరారు. శ్రీరాంపూర్ వీటీసీ ఆవరణలో శనివారం వారు మాట్లాడారు. బొగ్గు గనులను వేలం వేయడం వల్ల ప్రైవేటు వ్యక్తులకు లాభం, సింగరేణికి నష్టం జరుగుతుందన్నారు. ప్రైవేటీకరణ చేయబోమని చెప్పే నాయకులు వేలం వేయడం వల్ల ప్రైవేటీకరణ కాదా అని వారు ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లో నామినేషన్ పద్ధతిలో గనులు కేటాయించి, తెలంగాణలో సింగరేణికి ఇవ్వకపోవడం సరికాదన్నారు. అన్నివర్గాల ప్రజలు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ ధర్నాకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు చెవుల శ్రీనివాస్, ఆరెల్లి రమేష్, శివశంకర్, కనకయ్య, సాగర్, మల్లేష్, రాజ్‌కుమార్, తదితంలు పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలను ఖండిస్తున్నాం'

శ్రీరాంపూర్, జూలై 13: తమ అసోసియేషన్‌పై గోదావరిఖనికి చెందిన నూనేటి సతీష్ కుమార్‌యాదవ్ చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని శ్రీరాంపూర్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సంపత్, ప్రధానకార్యదర్శి రాంరెడ్డి తెలిపారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలో 120మంది కాంట్రాక్టర్లు ఉన్నామన్నారు. సింగరేణిలోని అన్ని డివిజన్లకు చెందిన కాంట్రాక్టర్లు ఏ ఏరియాలో వాళ్లు ఆ ఏరియాలో పనులు చేసుకోవాలని నిర్ణయించుకున్నామన్నారు. ఇప్పటివరకు అదేమాదిరిగా మసలు కుంటున్నామని తెలిపారు. కానీ గోదావరిఖని ప్రాంతానికి చెందిన సతీష్‌కుమార్ యాదవ్, కుర్మ సతీష్ ఈ విధానాన్ని ఉల్లంఘించి టెండర్‌వేసి పనులు పొందారన్నారు. గతంలో అందరికీ పనులు వచ్చేలా చూసేవారమని, కానీ పైన పేర్కొన్న వారు స్వార్థంగా ఆలోచిస్తూ తమకు మాత్రమే పనులు కావాలని చూస్తున్నారన్నారు. వాటిని ఇతరులకు అమ్ముకొని లాభం గడిస్తున్నారని ఆరోపించారు. వారి విధానాలను తాము ప్రశ్నించినందుకు అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అందరికీ న్యాయం చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని వివరించారు. సమావేశంలో కాంట్రాక్టర్లు కరుణాకర్, బక్క శ్రీనివాస్, మెండ రాజు, ఎంబడి కుమారస్వామి, పెట్టం సత్యనారాయణ, కె. కుమారస్వామి, నాగేశ్వర్ రావు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డోర్లి-2 ఓసీని సందర్శించిన ప్రొఫెసర్

రెబ్బెన, జూలై 13: బెల్లంపల్లి ఏరియాలోని మూతబడిన డోర్లి ఓసీ-2ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వెస్ట్‌బెంగాల్‌కు చెందిన ప్రొఫెసర్ సుదీప్తా ముఖోపాధ్యాయ శనివారం సందర్శించారు. మూతపడిన గని, పరిసర ప్రాంతాల్లో చేపట్టిన పర్యావరణ, ప్రజాహిత పనులు, కట్టడాలను పరిశీలించారు. నాటిన మొక్కలు, పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న నీటి నిర్వహణ, మృతిక సంరక్షణ చర్యలు తదితర వాటిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జీఎం రవిప్రసాద్, ప్రాజెక్టు అధికారి ఎన్ ఉమాకాంత్, ఏరియా సర్వేయర్ చంద్రశేఖర్, కార్పోరేట్ అదనపు మేనేజర్ తిరుపతి, ఎం రవీంద్రనాత్, డోర్లి ఓసీ2 మేనేజర్ మహన్రష్, తదితరులున్నారు.



డోర్లి-2 ఓసిని పరిశీలిస్తున్న ప్రొఫెసర్ సుదీప్తా ముఖోపాధ్యాయ

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆసిఫాబాద్, జూలై 13: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై రాజేశ్వర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని వివేకానంద చౌక్‌లో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని అనుమతిపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు దత్తు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్టు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 13: ఆసిఫాబాద్ మండలంలోని బూర్గుడగ్రామశివారులో శనివారం పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్సు సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గుడశివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు టాస్క్‌ఫోర్సు సిబ్బంది దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారివద్ద ఉన్న మూడు సెల్‌ఫోన్లు, రూ.13,800లను స్వాధీనపరుచుకొని కేసు నమోదు చేసుకొని ఆసిఫాబాద్ పోలీసుస్టేషన్‌లో అప్పగించామన్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్సు ఎస్సై గంగన్న, కానిస్టేబుల్ సంజీవ్ పాల్గొన్నారన్నారు.

కొమ్మ కొమ్మకు పిచ్చుక గూళ్లు



చెట్టు కొమ్మలకు పిచ్చుక గూళ్లు

బెజ్జూరు, జూలై 13: మండల కేంద్రంలోని ఓ చెట్టుపై సుమారు 50 పిచ్చుకలు గూళ్లను ఏర్పాటు చేసుకున్నాయి. రోడ్డు వెంట వచ్చిపోయే వారు ఒకే చెట్టుపై పిచ్చుకలు ఇన్ని గూళ్లు ఏర్పాటు చేసుకోవడాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. పిచ్చుక గూళ్లలో వాటి పిల్లలు కిలకిల రావాలు, కేరింతలు కొడుతుండడం చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి

నిర్మల్ కల్చరల్, జూలై 13 : ప్రతీఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ జి ఈశ్వర్ కోరారు. ప్రియదర్శిని నగర్‌లోని విజేత స్కూల్ లో ఆయన శనివారం మొక్కలు నాటారు.

తాంసిలో పిడుగుపాటుతో 12 మేకలు మృతి

తాంసి, జూలై 13: మండల కేంద్రంలో పిడుగుపాటుకు 12 మేకలు మృతి చెందాయి. వివరాల ప్రకారం శనివారం రోజున మండల కేంద్రానికి చెందిన రాగి కిష్టుకు చెందిన పది మేకలు, పెద్దపల్లి రాములుకు చెందిన రెండు మేకలు పిడిగు పడి మృతి చెందాయి. ఎప్పటి లాగే తమ మేకలను మేపడానికి బోడగుట్ట సమీపానికి వెళ్లారు. శనివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో భారీవర్షం కురియడంతో పక్కనే ఉన్న చెట్టు కిందకి మేకల మందను నిలుచోబెట్టి వీళ్ల ఇద్దరు మరో చెట్టు కింద నీలుచున్నారు.

ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో మేకల మంద ఉన్న చెట్టుపై పడటంతో 12 మేకలు మృత్యువాత పడ్డాయి. అంతేకాకుండా ఈ ఘటనలో మరికొన్ని మేకలు సైతం స్వల్పగాయాలతో బయటపడ్డాయి. మృతి చెందిన మేకల విలువ దాదాపు లక్షా70వేల రూపాయల వరకు ఉంటుందని మేకల యజమానులు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

మూడు ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు

భైంసా, జూలై 13 : నియోజకవర్గ పరిధిలో నిర్మాణ చివరిదశలోనున్న మూడు ఆలయాలకు నిధులు మంజూరయ్యాయని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తెలిపారు. శనివారం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో విలేకరులకు నిధుల మంజూరి వివరాలను వెల్లడించారు. లోకేశ్వరం మండలం ఎడ్డూర్ గ్రామంలోని శ్రీ మహాదేవ్ ఆలయానికి రూ.18.36 లక్షలు, భైంసా మండలం దేగాం గ్రామంలోని శ్రీ దత్త మందిరానికి రూ.9.21 లక్షలు, ముథోల్ మండలం తరోడా గ్రామంలోని శ్రీ మహాలక్ష్మీ మందిరానికి రూ.1.44 లక్షల నిధులు మంజూరు అయినట్లుగా పేర్కొన్నారు. ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రివర్యులు కొండ సురేఖ, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు ముథోల్ నియోజక వర్గ ప్రజానీకం తరపున కృతజ్ఞతలు తెలిపారు. మంజూరైన నిధులు ఐదు రోజుల వ్యవధిలోగా సంబంధిత ఆలయాల బ్యాంక్ అకౌంట్లలో జమ చేయబడుతాయని వివరించారు. ఇదే క్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లోనున్న ఇతర ఆలయాల నిర్మాణాల బిల్లులను త్వరితగతిన మంజూరి చేయించేందుకు చర్యలు చేపట్టినట్లుగా వెల్లడించారు

చెట్టును ఢీకొన్న కారు : బాలుడి మృతి

ముగ్గురికి తీవ్రగాయాలు


జైసన్‌రాజ్ (ఫైల్)

జన్నారం, జూలై 13: చెట్టును కారు ఢీకొనడంతో బాలుడు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన జన్నారం మండలంలోని టీజీపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా లింగాపూర్ మండలం కొత్తపల్లి (చిక్కులగూడెం) గ్రామానికి చెందిన జాదవ్ గోపిచంద్ నార్నూర్ సీఐ గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మంద మర్రిలో పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి తిరిగి వారి స్వగ్రామానికి వెళ్తుండగా అర్ధరాత్రి సమయంలో టీజీపల్లి గ్రామ సమీపంలో కారు చెట్టును ఢీకొంది. ప్రమాదంలో జాదవ్‌గోపిచంద్ కుమారుడు జైసన్‌రాజ్ (10) అక్కడికక్కడే మృతి చెందగా, అతడి భార్య గీత, అత్త జిజియా బాయితోపాటు జాదవ్ గోపిచంద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలించారు. జాదవ్ భీంరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజవర్ధన్ తెలిపారు.

భూమి వివాదంతో ఒకరు ఆత్మహత్య

చెన్నూరు, జూలై 13: దుగ్నేపల్లి గ్రామానికి చెందిన వెయ్యిగండ్ల వెంకన్న (47) భూ వివాదంతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుగ్నేపల్లి గ్రామానికి చెందిన దాగామ రాజయ్యకు పిల్లలు లేకపోవడంతో 40 సంవత్సరాల క్రితం బంధువుల వద్ద నుంచి వెయ్యిగండ్ల వెంకన్నను దత్తత తెచ్చుకున్నారు. తనకున్న ఆస్తి మొత్తాన్ని దత్త కుమారుడు వెంకన్న పేరు మీద రాశాడు. దాగామ రాజయ్య సోదరుడు రామయ్య ఆస్తిలో తనకు వాటా కావాలని అడ్డు పడడంతో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన వెంకన్న గురువారం రాత్రి క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంకన్నను చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మంచిర్యాలకు తరలించారు. చికిత్సపొందుతూ వెంకన్న శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ రవీందర్ పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని యువతి అనాథాశ్రమానికి తరలింపు

హాజీపూర్, జూలై 13: మతిస్థిమితం లేని యువతిని జిల్లా కేంద్రంలోని కల్వరి యువశక్తి అనాథాశ్రమం నిర్వాహకులు అక్కున చేర్చుకున్నారు. గుడిపేట బెటాలియన్ ఎదుట శనివారం మతిస్థిమితం లేని యువతిని గుర్తించిన కానిస్టేబుల్ ఎస్‌ఐ సంపత్‌కు తెలిపారు. ఆయన జిల్లా కేంద్రంలోని ఆశ్రమ నిర్వహకుడు కుమార్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. ఆయన బెటాలియన్‌కు చేరుకోగా యువతిని అప్పగించారు. మతిస్థిమితం లేని, వృద్ధులు కనిపిస్తే 9791973636కు ఫోన్ చేయాలని లేదా పోలీసులకు సమాచారం అందించాలని కల్వరి కుమార్ తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

మంచిర్యాల అర్బన్, జూలై 13 : మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని రైలు ఢీకొని పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన సయ్యద్ మొహారాజ్ పాషా (31) మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని ఆయన పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

దళిత కుటుంబాలకు పరామర్శ

భీమారం, జూలై 13 : ఆరేపల్లి గ్రామంలోని దళిత కుటుంబాలను జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ బృందం సభ్యుడు జిల్లపల్లి వెంకటేష్ శనివారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న రాత్రి భీమారం గ్రామానికి చెందిన కట్ట నాగరాజు ఆరు ట్రాక్టర్ల సహాయంతో 25 మంది దళిత కుటుంబాలకు చెందిన 30 ఎకరాల భూమిలో సాగు చేసిన పత్తి పంటను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఈ విషయంలో దళిత కుటుంబాలకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దశరథం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నో అడ్మిషన్

జన్నారం, జూలై 13: మండలంలోని అక్కపల్లి గూడ ప్రైమరీ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకోవడం లేదు. గతంలో ఇక్కడ 32 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 152కు చేరింది. ఒకేసారి ఇంత మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చేరడానికి కారణం బదిలీ వచ్చిన ఉపాధ్యాయుడు జాజాల శ్రీనివాసే కారణం. జన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని అక్కెపల్లిగూడ ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. గతేడాది పదుల సంఖ్యలోనే విద్యార్థులు చదువుకునేవారు. ఈ యేడు ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా పొనకల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాజాల శ్రీనివాస్ బదిలీపై అక్కెపల్లిగూడ పాఠశాలకు వచ్చాడు. ఈ క్రమంలో పొనకల్ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడి వెంటే అక్కపల్లిగూడ పాఠశాలకు వచ్చారు. దాదాపు రెండు కిలోమీటర్ల దూరమైనప్పటికీ సార్‌తోపాటే విద్యార్థులు వచ్చారు. ప్రధానోపాధ్యాయుడు జాజాల శ్రీనివాస్ గురుకుల, నవోదయ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా బోధిస్తారని, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు సార్ వెంటే వెళ్తున్నామని పేర్కొన్నారు. వీరితోపాటు రెగ్యులర్ అడ్మిషన్‌లు కూడా రావడంతో ఇక అడ్మిషన్లు తీసుకోవడం లేదు. విద్యార్థులు పెరగడంతో తరగతి గదులతోపాటు ఉపాధ్యాయులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



అక్కెపల్లిగూడ ప్రైమరీ పాఠశాల

-ఉపాధ్యాయులను నియమించాలి

అక్కెపల్లిగూడ ప్రైమరీ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. ఈ యేడు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, కరుణ అనే ఉపాధ్యాయురాలు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పాఠశాల పాలక మండలి ఆధ్వర్యంలో మరో ముగ్గురు విద్యావాలంటీర్లను నియమించుకున్నారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులను మంజూరు చేయాలని ఎంఈవోకు విన్నవించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

అర్థమయ్యేలా బోధించేందుకు కృషి

- శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తా. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక నైపుణ్యం ఉంటుంది. వాటిని గుర్తించి బోధించడం ద్వారా ఉపాధ్యాయులపై ఆప్యాయత పెంచుకోవడంతో పాటు చదువుపై ఆసక్తి చూపుతారు.

వసతుల కల్పనపై దృష్టి

- విజయ్‌కుమార్, ఎంఈవో

వసతుల కల్పనను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో అడ్మిషన్‌లు తీసుకుంటున్నాం. అక్కపల్లిగూడ పాఠశాలలో 152 మంది విద్యార్థులకు అడ్మిషన్‌లు ఇచ్చాం. సరిపడ గదులు లేవు. పాఠశాల పాలక మండలి ఆధ్వర్యంలో ముగ్గురు విద్యావాలంటీర్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించేందుకు కృషి చేస్తున్నాం. అందుకే అడ్మిషన్‌లు తీసుకోవడం లేదు.

ఆర్‌కె 7 గని మూసివేత ?

- పర్యావరణ అనుమతులు రాకపోవడమే కారణం

శ్రీరాంపూర్, జూలై 13: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కె 7 గనిని మూసి వేయాలని అటవీశాఖ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు సమాచారం. ఈ మేరకు శనివారం రెండో షిఫ్ట్ నుంచి పనులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఆర్‌కె 7 గనికి 2020 వరకు బొగ్గు తవ్వకునేందుకు కేంద్ర అటవీశాఖ నుంచి అనుమ తులు లభించాయి. మళ్లీ అనుమతులు ఇవ్వాలని 2018లో సింగరేణి యాజమాన్యం అటవీశాఖకు లేఖ రాసింది. అటవీశాఖ నుంచి అనుమతి రాలేదు. ఈ క్రమంలో నిర్దేశిత సీమ్‌ల వరకు మాత్రమే బొగ్గు తీయాలని అనుమతి ఇవ్వగా, 10 సీమ్‌ల వరకు అదనంగా బొగ్గు తీసినట్లు అటవీశాఖ అధికారులు గుర్తిం చారు. దీంతో సంబంధిత శాఖ అధికారులు అనుమతులు పొందే వరకు గనిని మూసివేయాలని ఆదేశించారు. అనుమతి వచ్చే వరకు నెల రోజులు పట్టే అవకాశం ఉన్నట్లు కొందరు అధికారులు పేర్కొంటున్నారు. గని మూత విషయంపై శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి. సంజీవరెడ్డిని వివరణ కోరగా ఒక దిశలో పోవాల్సిన పనులు మరో దిశలో పోయాయి. దీంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆ దిశను మార్చేందుకు యంత్రాలను తరలిస్తున్నాం. ఆ పనులు కొనసాగుతున్నాయి. నూతన సీమ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. మళ్లీ బొగ్గు తవ్వకాలు ప్రారంభిస్తామని తెలిపారు.

మహిళపై రౌడీషీట్ ఓపెన్

చెన్నూరు, జూలై 13: మంచిర్యాల జిల్లాలో ఓ మహిళపై రౌడీషీట్ ఓపెన్ అయ్యింది. జిల్లాలో మహిళపై రౌడీషీట్ ఓపెన్ చేయడం మొదటి కేసు అని ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవీందర్ శనివారం విలేకరుల సమావేశంలో రౌడీషీట్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భూవివాదాలు, పలు కేసుల్లో నిందితురాలైన పీవోడబ్ల్యూ నాయకురాలు మద్దెల భవానీపై రౌడీషీట్ ఓపెన్ చేశామన్నారు. శ్రీరాంపూర్ చెందిన మద్దెల భవానీ పీవోడబ్ల్యూ నాయకురాలు ముసుగులో భూవివాదాలు, ఇతర వివాదాల్లో తలదూర్చడం, బెదిరింపులకు పాల్పడడంతో ఆమెపై చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఏడు కేసులు, కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైనట్లు ఆయన తెలిపారు. కొంత కాలంగా ఆమెపై ఫిర్యాదులు వస్తుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆమె కదలికలపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. భవిష్యత్‌లో ఆమె ప్రవర్తన మార్చుకోకపోతే పీడీయాక్టు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రగతి శీల మహిళ సంఘానికి సంబంధం లేదు

మద్దెల భవానీకి ప్రగతి శీల మహిళ సంఘంతో ఎలాంటి సంబంధం లేదని ప్రగతి శీల మహిళ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ తెలిపారు. శనివారం చెన్నూరులో ఆమె మాట్లాడుతూ మద్దెల భవానీ కొన్ని రోజుల నుంచి మంచిర్యాల పట్టణంలో ప్రగతి శీల మహిళ సంఘం పేరుతో దందాలు చేస్తుందని, ఆమెపై పోలీసులు రౌడీషీట్ తెరిచారన్నారు. భవానీ భూదందాలకు, అనేక అక్రమాలకు పాల్పడుతుందని ఆమెతో మాకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులందరు గమనించాలని కోరారు.



మాట్లాడుతున్న అందె మంగ

లో ఓల్టేజీకి శాశ్వత పరిష్కారం

కాసిపేట, జూలై 13 : మండలంలో నెలకొన్న విద్యుత్ ఓల్టేజీకి శాశ్వత పరిష్కారం చేపట్టామని ఏఈ స్వర్ణలత అన్నారు. విద్యుత్ వినియోగం పెరిగిన దృష్ట్యా శనివారం కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో 160 కిలోవాట్స్ డీటీఆర్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ వినియోగదారులకు లో ఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. సబ్ ఇంజనీర్ సాయి, లైన్‌మెన్ , జేఎల్‌ఎంలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఈ స్వర్ణలత

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు


చైర్మన్‌ను సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

జన్నారం, జూలై 13 : ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన నగరి ప్రీతంను శనివారం హైద్రాబాద్‌లో మండల దళిత సంఘాల నాయకుడు దూమల్ల రమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. ఎస్సీ కులాలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలన్నారు. నాయకులు ఇందయ్య, బానేష్, ప్రవీణ్, ప్రశాంత్, కుమార్ పాల్గొన్నారు.

రెడ్డిమల్ల ప్రకాశంకు డాక్టరేట్

లక్షెట్టిపేటరూరల్, జూలై 13 : పట్టణానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు న్యాయవాది రెడ్డిమల్ల ప్రకాశం డాక్టరేట్ పట్టా పొందారు. ప్రకాశం 46 ఏండ్లుగా సామాజిక చైతన్యం, నిరక్షరాస్యత నిర్మూలనతో పాటు విద్యారంగంలో విశేష కృషి చేసినందుకు మ్యాజిక్ ఆర్ప్ యూనివర్శిటీ, ఎంబీఆర్ డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పట్టాను తీసుకున్నారు.


ఢిల్లీలో పట్టా తీసుకుంటున్న ప్రకాశం

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి


విలేకరులతో మాట్లాడుతున్న గ్రామస్థులు

జైనూర్, జూలై 13: చింతకర్ర గ్రామ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో గ్రామస్థులు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని చింతకర్ర, తాగిగూడ, కిషన్‌నాయక్ తాండ తదితర గ్రామాలకు వెళ్లే ప్రధానరోడ్డు అధ్వాన్నంగా తయారైందన్నారు. ఆయాగ్రామాల ప్రజలు ఈ రోడ్డు వెంట వెళ్లినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలకు రోడ్డు మొత్తం గుంతలు ఏర్పడిందన్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొరెంగ మల్లశ్రీ, మండల అధ్యక్షుడు మడావి గణపతి, ఉపాధ్యక్షుడు అంకోష్, ప్రధానకార్యదర్శి కనక నాగేష్, కార్యదర్శి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సామాజికసేవా అవార్డు అందుకున్న మండలవాసి


అవార్డును అందుకుంటున్న రంగు మహేష్ గౌడ్

రెబ్బెన, జూలై 13: మండలానికి చెందిన సామాజిక కార్యకర్త రంగు మహేష్ గౌడ్ ఉత్తమ సామాజిక సేవా అవార్డును శనివారం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డును మానవహక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్‌కె జైన్, హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. కరోనా సమయంలో ప్రజలకు వివిధ సేవలు అందించినందుకు గాను ఈ అవార్డు దక్కింది.

ఎస్పీని కలిసి జీఎం రవిప్రసాద్


ఎస్పీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న జీఎం

రెబ్బెన, జూలై 13: జిల్లా ఎస్పీ శ్రీనివాసరావును ఆసిఫాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో శనివారం బెల్లంపల్లి సింగరేణి జీఎం రవిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి మొక్కను బహూకరించారు. బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి, పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం పోలీస్ డిపార్టుమెంటు, సింగరేణి కలిసి చేయాల్సిన వివిధ పనులపై కాసేపు చర్చించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ సెక్యూరిటీ అధికారి వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలగానే సాంకేతిక విద్య

● ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలుగా మారుస్తామని సీఎం ప్రకటన ● జిల్లాలో నేటికీ ఏర్పాటుకాని పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు

● నైపుణ్యాలు లేక ఉద్యోగ సాధనలో వెనుకబడుతున్న విద్యార్థులు



రెబ్బెన, జూలై 13: ఉద్యోగాలు సాధించాలంటే సర్టిఫికేట్ ఉంటే సరిపోదని, అందుకు తగిన నైపుణ్యం ఉంటేనే ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీరియ్ ట్రెయినింగ్ సెంటర్ (ఐటీఐ) కళాశాలలను మారుతున్న కాలానికి అనుగుణంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా మారుస్తామని సీఎం పేర్కొన్నారు. కానీ అన్ని రంగాలతోపాటు విద్యారంగంలో వెనుకబడిన కుమరంభీం జిల్లా ఆసిఫాబాద్‌లో ఇప్పటివరకు నైపుణ్యం మాట పక్కన పెట్టిడితే కనీసం సాంకేతిక విద్యావకాశాలు కూడా అందుబాటులో లేవు. కాగజ్‌నగర్‌లో ఒకే ప్రయివేటు ఐటీఐ కళాశాల ఉంది. గిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులో లేకపోవటంతో సాధారణ డిగ్రీలతోనే విద్యార్థులు విద్యను పూర్తి చేస్తున్నారు. ఇతర జిల్లాల విద్యార్థులతో ఉగ్యోగాల సాధన కోసం పోటీపడుతున్నారు.

సాంకేతిక రంగానికి భవిష్యత్తు..

ఆర్టీఫిషల్ ఇంటిలిజెన్స్ రాకతో ప్రపంచ వేగంగా మారుతోంది. శాస్త్ర సాంకేతిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఆయారంగాల్లో నైపుణ్యాలు పెంచుకునే వారికి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెరిగేందుకు మార్గాలున్నాయి. జిల్లాలో ఆ దిశగా అడుగులు పడటం లేదు. ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ), పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా తక్కువ సమయంలోనే ఉద్యోగ అవకాశాలు సాధించే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి మాత్రమే సింగరేణి కంపెనీ వేతనంతో కూడిన శిక్షణ(అప్రెంటీస్‌షిప్) ఇవ్వటానికి ముందుకు వస్తోంది. అలాగే ఆర్టీసీ వంటి ఇతర సంస్థలు కూడా ఐటీఐ సర్టిఫికేట్ ఉంటేనే అవకాశాలు కల్పిస్తున్నాయి.

ఈ కారణం చేత జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ కాలేజీలను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండు చేస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక విద్య కోసం హైదరాబాద్, కరీంనగర్, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. జిల్లాలో విద్యార్థులకు అనుకున్నంత అవకాశాలు లేకపోవటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. దూర ప్రాంతాల్లో తమ పిల్లల్ని చదివించడం కష్టంగా ఉందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, నాయకులు వెంటనే స్పందించిక జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఐటీఐని ఏర్పాటు చేయాలి..
-తిరుపతి పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి



జిల్లాలో ప్రభుత్వ ఐటీఐని ఏర్పాటు చేయాలి. ఈ విషయంలో అధికారులు, నాయకులు వెంటనే స్పందించి తగిన నిర్ణయం తీసుకోని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలి. ప్రభుత్వ ఐటీఐ లేకపోవటంతో ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది.


అత్తను పొడిచి చంపిన అల్లుడు

● అనంతరం ఆత్మహత్యాయత్నం


నెల్లి విజయ (ఫైల్)

మంచిర్యాల అర్బన్, జూలై 13: మంచిర్యాల జిల్లా కేంద్రంలో అత్తను అల్లుడు కత్తితో పొడిచి చంపి అనంతరం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. జిల్లాకేంద్రంలోని చున్నంబట్టి వాడలో నెల్లి విజయ(40) నివాసం ఉంటోంది. ఆమెకు భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెను జిల్లా కేంద్రంలోని భగవంతం వాడకు చెందిన శాతం వెంకటేష్ తో 6యేండ్ల క్రితం వివాహం జరిపించారు. కొంత కాలంగా అల్లుడు మద్యానికి బానిస కావడంతో అత్తకు, అల్లుడికి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం మానేయాలని చెప్పడంతో వారిమధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. క్షణికా వేశంలో వెంకటేష్ అత్త విజయను కత్తితో మెడ, కడుపులో పొడవడంతో అక్కడికక్కడే చనిపోయింది. అనంతరం వెంకటేష్ కూడా మెడను కోసుకున్నాడు. ఆ సమయంలో ఇంట్లో ఇద్దరే ఉన్నారు. గాయపడిన వెంకటేష్ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో వెంకటేష్‌ను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం పరిస్థితివిషమంగా ప్రైవేటుఆస్పత్రిలో చేర్పించారు. విజయ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

50 ద్విచక్ర వాహనాల పట్టివేత


తనిఖీలు చేస్తున్న పోలీసులు

నిర్మల్ కల్చరల్, జూలై 13: జిల్లాకేంద్రంలో ఎస్పీ జానకీషర్మిల ఆదేశాలమేరకు శనివారం సాయంత్రం మూడుచోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 50ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జైశంకర్‌చౌరస్తా,శివాజీచౌక్, బస్టాండ్ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో నంబర్‌ప్లేట్లులేని ద్విచక్ర వాహనాలు పట్టుబడ్డాయన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

సారంగాపూర్, జూలై 13 : మండలంలోని చించోలి (బి) ఎక్స్ రోడ్డు వద్ద శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వాహనాలకు ఎలాంటి ధ్రువపత్రాలు లేని వాహనాలతో పాటు నంబర్ ప్లేట్స్ లేని వాహనాలను పట్టుకొనిజరిమానా విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ప్రతిఒక్కరూ వాహనాల ధ్రువపత్రాలు కలిగిఉండి, డ్రైవింగ్ లైసెన్స్‌ఉండాలని వాహనచోదకులతో పేర్కొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చేతి పంపు బాగు చేయరూ

దహెగాం, జూలై 13: మండలంలోని మొట్లగూడ గ్రామంలోని బొగడగూడెం కాలనీలో చేతిపంపు పని చేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మరోవాడలోని చేతి పంపు నీటిని తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని కొత్తపల్లి ప్రాథమికపాఠశాల సమీపంలోని కోయవాడ చేతి పంపు సీసీరోడ్డు కిందికి ఉండడంతో నీటిని తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. మిషన్‌భగీరథ నీరుసరఫరా 20రోజులుగా నిలిచిపోయిందని తెలిపారు. అధికారులు స్పందించి చేతిపంపు బాగు చేసి నీటి సమస్యను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.


మొట్లగూడలో పనిచేయని చేతిపంపు

వర్షాలకు తెగిపోయిన రోడ్లు

● ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు

సిర్పూర్(టి), జూలై 13: మండలంలోని మారు మూల ప్రాంతాలైన చీలపల్లి, మెట్‌పల్లి, లింబుగూడ, రావన్‌పల్లి తదితరగ్రామాలకు వెళ్లే ప్రధానరోడ్డు ఇటీవల కురిసిన భారీవర్షాలకు తెగిపోయింది. దీంతోఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయతీ ప్రత్యే కాధికారులు తట్టెడు మట్టికూడా వేయడంలేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చీలపల్లి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన చీలపల్లి రోడ్డు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



'ప్రాణహిత-చేవెళ్ల'పై చిగురిస్తున్న ఆశలు

ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకం



ప్రాజెక్టు రూటు మ్యాపు

- ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం హామీ
- పూర్తయితే తీరనున్న సాగునీటి కొరత
- గత ప్రభుత్వ హయాంలో మరుగున పడిన పనులు



నెన్నెల మండలం మైలారం క్యాంపు నుంచి టన్నెల్ పైపులను తరలిస్తున్న లారీలు (ఫైల్)

మంచిర్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు సాగు నీరందించే ఉద్దేశ్యంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూపకల్పన చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సుజల స్రవంతి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు మంచి రోజులు రానున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు మళ్లీ జీవం పోసినట్లయింది. ఈ మేరకు ప్రాజెక్టును నిర్మించి తీరుతామని కాంగ్రెస్ ప్రభుత్వం పలుమార్లు హామీ ఇచ్చింది. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ప్రాణహితను విస్మరించింది. దీంతో ప్రాజెక్టుకు సంబంధించిన క్యాంపులను ఎత్తివేయగా, టన్నెల్ భారీ ఇనుప పైపులను కూడా కాంట్రాక్టింగ్ ఏజెన్సీ వెనక్కి తీసుకెళ్లింది. నెన్నెల మండలం మైలారం వద్ద ఏర్పాటు చేసిన భారీ పైపుల నిర్మాణ కేంద్రాన్ని, కాంక్రీటు మిక్సర్ ప్లాంటును కూడా తరలించుకుపోయారు. దీంతో ఏళ్లుగా సాగునీటిపై అన్నదాతలు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి.

16.4 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని 16.4 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే లక్ష్యంతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు ప్రతిపాదించింది. రూ.38,500 కోట్ల అంచనాతో 160 టీఎంసీల సామర్థ్యంతో 2008లో అప్పటి ప్రభుత్వం పథకానికి శ్రీకారం చుట్టింది. ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మించి టన్నెళ్లు, లిఫ్టులు, రిజర్వాయర్లు, డిస్ట్రిబ్యూటరీల ద్వారా నీటిని తరలించాలని ప్రతిపాదించారు.

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని బెల్లంపల్లి, చెన్నూరు, సిర్పూర్ నియోజకవర్గాల్లోని ఎనిమిది మండలాల్లో 56,800 ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళిక తయారు చేశారు. పనులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పనులను 28 ప్యాకేజీలుగా విభజించి వివిధ కాంట్రాక్టింగ్ కంపెనీలకు అప్పగించారు. మంచిర్యాల జిల్లాలో ఐదు ప్యాకేజీల్లో కాలువల నిర్మాణం చేపట్టవలసి ఉంది. ఒకటో ప్యాకేజీలో కౌటాల మండలం రణవెల్లి నుంచి ప్రారంభమైన కాలువ నిర్మాణం బెజ్జూర్ మండలం కర్జెల్లి దాటింది. దహెగాం, నెన్నెల మండలంలో పనులు చేపట్టారు. నెన్నెల మండలం మైలారం వద్ద టన్నెల్ నిర్మాణ పనులు చేపట్టారు. భారీ ఇనుప పైపులతో ఐదు కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. 5 ప్యాకేజీల ద్వారా చేపట్టిన పనుల్లో భూములు కోల్పోయిన వారికి 75 శాతం వరకు పరిహారం కూడా అందింది.

గత ప్రభుత్వ వైఖరితో..

బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి కారణంగా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించిన సామగ్రి వెనక్కి మళ్లడంతో భారీ మొత్తంలో నిధులు వృథా అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. మహారాష్ట్రలోని భూముల ముంపు వంకతో తుమ్మిడిహెట్టి వద్ద కాకుండా దిగువన ఉన్న కాళేశ్వరం వద్ద ప్రాజెక్టు నిర్మించారు. ఓ వైపు పూర్వ ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం జరగదని అంటూనే కాళేశ్వరం పనులు పూర్తి చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కోసం వందల కోట్లతో చేపట్టిన పనులను గుత్తేదార్లు అర్థంతరంగా వదిలివేశారు. 71 కిలోమీటర్ల మేర కాలువలు నిర్మించాల్సి ఉండగా 30 కిలోమీటర్ల మేర కాలువలు తవ్వి పనులను మధ్యలో వదిలేశారు. రెండు జిల్లాల పరిధిలోని కర్జెల్లి, సల్లుపల్లి, జిల్లెడ, కర్జి, జంగాల్‌పేట, కుశ్నపల్లి, మైలారం, దుబ్బపల్లి, తదితర ప్రాంతాల్లో చేపట్టిన పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రాజెక్టుకు పునర్జీవనం పోస్తే రూ.639 కోట్లతో ఇప్పటివరకు నిర్మించిన కాలువలు ఇతర పనులు తిరిగి ఉపయోగంలోకి వచ్చే అవకాశాలున్నాయి. తమ ప్రభుత్వ హయాంలో నిర్మించతల పెట్టిన ప్రాజెక్టు కావడం, పెద్దగా విద్యుత్ బిల్లులు చెల్లించే అవసరం లేకుండా గ్రావిటీ ద్వారా నీళ్ల తరలించే అవకాశం ఉండడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవేళ్ల వైపు మొగ్గు చూపే అవకాశాలున్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



గ్రామాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, జూలై 13: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని పలు కాలనీల్లో మార్నింగ్ వాక్ చేస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మారుమూల గ్రామాలైన బుద్దారం, సంకారాం, కన్నెపల్లి, చింతలపల్లి, అక్కెపల్లి, శివలింగాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్లోరినేషన్, శానిటేషన్ ప్రక్రియ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో నాలాల వ్యవస్థ అధ్వాన్నంగా ఉండడంతో ఆర్‌అండ్‌బీ శాఖ ఏఈ తివారీకి నాలాల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. లోఓల్టేజీ సమస్య పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, నాయకులు రాజమల్లగౌడ్, సూర్యనారాయణ, హేమంతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌తివారీ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు

దండేపల్లి, జూలై 13: వెల్గనూర్ గ్రామానికి చెందిన అక్కల చిన్నయ్య వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అండగా నిలిచారు. చిన్నయ్య అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. వారిది పేద కుటుంబం కావడంతో స్థానికులు వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ వైద్య ఖర్చుల కోసం రూ. 2.50 లక్షల ఎల్‌వోసి పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

17న ఆయుర్వేద వైద్య శిబిరం

మందమర్రిరూరల్, జూలై 13 : ఈ నెల 17న స్థానిక సీఈఆర్ క్లబ్‌లో డాక్టర్ విశ్వనాధ మహర్షి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తామని సింగరేణి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిబిరం ఉంటుందని, ప్రజలు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి




ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ

మంచిర్యాల అర్బన్, జూలై 13: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ అన్నారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాంగ్ రూట్, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేయరాదన్నారు. మద్యం సేవించి వాహనం నడిపినా, మైనర్లకు వాహనం ఇచ్చినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. పట్టణంలోని పండ్ల వ్యాపారులు వారి వ్యాపార సముదాయాల ఆవరణలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కవ్వాల టైగర్ జోన్‌లో ఆంక్షలు ఎత్తివేయాలి

జన్నారం, జూలై 13: కవ్వాల టైగర్ జోన్‌లో అటవీ ఆంక్షలు ఎత్తివేయాలని సామాజిక వేత్త భూమాచారి చేపట్టిన ప్రచారం శనివారం రాంపూర్ గ్రామంలో కొనసాగింది. ప్రజలకు అటవీ ఆంక్షలతో వస్తున్న నష్టాల గురించి వివరించారు. ఎక్కడా లేని విధంగా కేవలం జన్నారం కవ్వాల అభయారణ్యంలోనే ఆంక్షలు ఉండడం సరైంది కాదన్నారు. ఆంక్షలు ఉండడంతో భారీ వాహనాలు రావడం లేదన్నారు. వెంటనే ఆంక్షలు ఎత్తివేసేలా చూడాలన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్ బదిలీ



బదిలీపై వెళ్తున్న సైదులు

బెల్లంపల్లి, జూలై 13: బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు శనివారం బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఖమ్మం జిల్లా ముదిగొండలోని బాలుర గురుకుల పాఠశాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హుస్నాబాద్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఇక్కడకు రానున్నారు. బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్ ఐనాల సైదులు 2015లో ఇక్కడికి వచ్చినప్పటి నుంచి విద్యార్థులు ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, నీట్ తదితర ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు సీట్లు సాధించారు. ప్రిన్సిపాల్ సైదులు బదిలీపై వెళ్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

నేడు ఆటో యూనియన్ ఎన్నికలు

మందమర్రిరూరల్, జూలై 13: మందమర్రి పట్టణ ఆటో యూనియన్ అధ్యక్ష పదవికి ఆదివారం ఎన్నికలు నిర్వహిస్తున్నామని అడహక్ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు ఉంటాయని తెలిపారు. ప్రతీ ఆటో డ్రైవర్ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం 3 గంటలకు ఎన్నికలు ఫలితాలు వెల్లడవుతాయన్నారు. సమావేశంలో వెంకటేష్, శ్రీనివాస్, రమేష్, రవి, లక్ష్మణ్, శ్రీనివాస్, సతీష్, లింగమూర్తి, సంతోష్, శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వారాహి దేవికి పూజలు



హోమంలో పాల్గొన్న భక్తులు

మందమర్రిరూరల్, జూలై 13 : వేంకటేశ్వరాలయం ఎదురుగా ఉన్న సీఐఎస్ఎఫ్ బ్యారక్‌లోని వారాహి దేవి ఆలయంలో శనివారం భక్తులు పూజలు, హోమం నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ పూజారి దామోదరాచార్యులు మాట్లాడుతూ అమ్మవారిని పూజించడం వల్ల సుఖ సంతోషాలు కలుగుతాయని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వాసుదేవ్‌వరలక్ష్మీ, రాజేశంరాజేశ్వరి, లలితవాసు, భాగ్యలక్ష్మీరాజమౌళి, స్వరూప ఎల్లయ్య, భాగ్యలక్ష్మీ, ఇందిర, శ్రీదేవి, జయ భక్తులుపాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్, జూలై 13: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణ తరగతులకు దరఖాస్తు చేసుకోవాలని పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గంవర్క్, కంప్యూటర్ కోర్సు, స్పోకెన్ ఇంగ్లీషులలో మూడు నెలల శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 22లోపు జీఎం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అడుగుకో గుంత...

- చెన్నూరు-మంచిర్యాల ప్రధాన రహదారి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బురద రోడ్డు ఇబ్బందులు



గుంతలమయంగా రహదారి

చెన్నూరు, జూలై 13: చెన్నూరు - మంచిర్యాల ప్రధాన రహదారిపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు జంకుతున్నారు. అడుగుకో గుంతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి 63 జోడు వాగుల వంతెన వద్ద దాదాపు కిలోమీటరు మేర రహదారి గుంతలమయంగా మారింది. కురుస్తున్న వర్షాల వల్ల బీటీ రోడ్డు కిలోమీటరు మేర అధ్వానంగా తయారైంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలుపుతూ చేపట్టిన నిజామాబాద్- జగ్దల్‌పూర్ 63 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చెన్నూరు- భీమారం జోడు వాగుల ప్రాంతంలో రిజర్వు ఫారెస్టు ఉంది. ఇక్కడ వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

కేంద్రం నుంచి అటవీ శాఖ అనుమతులు లభించక పోవడంతో రహదారి నిర్మాణానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. వర్షాలు కురుస్తుండడంతో రహదారిపై ఉన్న తారు లేచిపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వెళ్లలేని పరిస్థితులున్నాయి. భారీ వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాహనదారులు వాపోతున్నారు. మంచిర్యాల నుంచి జోడు వాగుల వరకు ప్రయాణం సాఫీగా సాగగా మిగితాది మరో ఎత్తుగా మారిందని వాహనదారులు పేర్కొంటున్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కిలోమీటరు మేర దెబ్బతిన్న రహదారికి మరమ్మతు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

పొలాల్లో రైతునేస్తాలు



దండేపల్లి, జూలై 13: వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పొలాలను సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు. ట్రాక్టర్ ద్వారా జంబుకొడుతుండగా కొంగలు పొలంలో వాలిపోయాయి. ట్రాక్టర్ ద్వారా దున్నుతుంటే అందులో ఉండే వచ్చే పురుగులు, క్రిమికీటకలను తింటూ కొంగలు రైతులకు మేలు చేకూరుస్తున్నాయి.

వేలాల ఆలయంలో నేటి నుంచి అగ్నిగుండాలు

జైపూర్, జూలై 13: జైపూర్ మండలంలోని వేలాల మల్లన్న స్వామి ఆలయంలో ఆదివారం నుంచి అగ్నిగుండాల పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రమేష్ శనివారం తెలిపారు. తొలిఏకాదశి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం మల్లన్న స్వామి భ్రమరాంబికల విగ్రహాలను గోదావరి నదిలో గంగాస్నానం, సోమవారం పెద్దపట్నం వేసి ఒగ్గు పూజారులతో సంప్రదాయబద్ధంగా మల్లన్న స్వామి కల్యాణం నిర్వహించి సాయంత్రం అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రక్తకణాలను దానం చేసిన యువకుడు

మంచిర్యాల అర్బన్, జూలై 13 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో మనం ఫౌండేషన్ సభ్యుడు రాజ్‌కుమార్ ఏ పాజిటివ్ రక్తకణాలను దానం చేశాడు. వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామానికి చెందిన గౌతమికి తెల్లరక్తకణాలు తగ్గిపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న రామకృష్ణాపూర్ చెందిన మనం ఫౌండేషన్ సభ్యుడు రాజ్‌కుమార్ రక్తకణాలను దానం చేశారు. రాజ్‌కుమార్ ఇప్పటి వరకు 49 సార్లు (13 సార్లు రక్తదానం, 36 సార్లు రక్తకణాలను) దానం చేశారు. ఆయనను బ్లడ్‌బ్యాంకు ఇన్‌చార్జి, రెడ్‌క్రాస్ స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్ వి.మధుసూదన్‌రెడ్డి ప్రశంసాపత్రాన్ని అందించి అభినందించారు.

నిషేధిత గడ్డిమందు పట్టివేత

భీమిని, జూలై 13: మండలంలోని మల్లీడి గ్రామ ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి పోలీసులు 10 లీటర్ల నిషేధిత గ్లైఫోసెట్ రకానికి చెందిన గడ్డిమందును పట్టుకున్నారు. కారులో నిషేధిత గడ్డి మందు సరఫరా అవుతుందనే పక్కా సమాచారంతో పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. కాగజ్‌నగర్ మండలంలోని సారుసాల గ్రామానికి చెందిన దాగం దశరథ్, గుబుడె సైకు, కార్తీక్, పుల్ల కృష్ణ, నితిన్‌లు 10 లీటర్ల గడ్డిమందును మహారాష్ట్ర నుంచి భీమినికి కార్‌లో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. రెండు కారులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గడ్డి మందును అక్రమంగా ఎవరైనా చేరవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పట్టుబడిన నకిలీ గడ్డి మందు డబ్బాలను మండల వ్యవసాయాధికారి విజయ్ కి అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో పోలీసులు పాల్గొన్నారు.

ఐకేపీ కార్యాలయంలో మందు పార్టీ

- కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆరోపణ - పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



ఏపీఎంను నిలదీస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమిని, జూలై 13: మండల కేంద్రంలోని భారతమాత మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఐకేపీ ఏపీఎం పంజాల ప్రకాష్‌గౌడ్ మండలంలోని వీఏఓలు కొందరు పార్టీ చేసుకుంటున్నారని తెలియడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యాలయానికి చేరుకొని వారిని నిలదీశారు. ఈ విషయాన్ని రాత్రి పోలీసులకు సమాచారం అందించారు. కార్యాలయం వద్ద నాయకులకు, ఐకేపీ సిబ్బందికి వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు చేరుకొని విచారణ చేపట్టారు. కార్యాలయంలోనే దావత్ చేసుకుంటున్నారని కాలనీ వారు సమాచారం ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు. దీంతో తాము వచ్చేసరికి ఐకేపీ ఏపీఎం, వీఏఓలు మందు సీసాలను కిటికీల నుంచి బయటకు విసిరివేసారని వాటి ఆనవాళ్లను, తినుబండారాలను పోలీసులకు చూపించారు. అనంతరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఏపీఎం ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ చిన్నగుడిపేట గ్రామ లోకోస్ డాటా ఎంట్రీ చేస్తున్నామని మందు తాగడం లేదన్నారు.

యువత చెడు అలవాట్లకు బానిస కావద్దు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై విజయ్‌కుమార్

భీమిని, జూలై 13: గ్రామంలో యువత చెడు అలవాట్లకు బానిసలు కావద్దని ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని ఖర్జీభీంపూర్‌లో పల్లెనిద్ర నిర్వహించారు. జీవితంలో విద్యార్థి దశ చాలా ముఖ్యమైనదని తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలన్నారు. గ్రామంలో అనుమానితులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతీ ఒక్కరూ సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై తిరుపతి, పోలీసులు రాజ్‌కుమార్, పోచమల్లు, మల్లేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో గ్రాండ్ మాస్టర్ పట్టా



మంచిర్యాల కలెక్టరేట్, జూలై13: అబాకస్ ద్వారా జమ, తీసివేత, గుణకార, భాగాహారాలను అవలీలగా చేసి అంగులియ అబాకస్‌లో గ్రాండ్ మాస్టర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థి జయంత్ వర్మకు అబాకస్ ఫౌండర్ అల్లగట్ట గంగాధర్ గ్రాండ్ మాస్టర్ పట్టా అందజేశారు. శనివారం రివిలేషన్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రాపోలు విష్ణువర్ధన్‌రావుతో కలిసి పట్టాను అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

అందుగులపేటలో మీ సేవ కేంద్రం

మందమర్రిరూరల్, జూలై 13: మండలంలోని అందుగులపేట గ్రామంలో త్వరలో మీ సేవ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. శుక్రవారం డీఆర్‌డీవో కిషన్ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీఎం లలిత, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కవ్వాలలో పర్యటించిన ఐటీడీఎఫ్‌వో



పక్షులను వీక్షిస్తున్న ఐటీడీఎఫ్‌వో మాధవరావు

జన్నారం, జూలై 13 : జన్నారం ఎఫ్‌డీవో విధులుగా నిర్వహించి ఐటీడీఎఫ్‌వోగా హైద్రాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న మాధవరావు దంపతులు శనివారం కవ్వాలలో పర్యటించారు. భైనస్‌కుంట, మైసమ్మకుంట ప్రాంతాల్లో పర్యటించారు. నీలుగాయిలు, జింకలు, పక్షులను వీక్షించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు ఇందన్‌పల్లి, జన్నారం రేంజ్‌లలో పలు ప్రాంతాలను పరిశీలించారు. వన్య ప్రాణుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఆర్‌వో హఫీజుద్దీన్, సిబ్బంది ఉన్నారు.